# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





# -28-
## అమెరికుక్కల్, పిల్లుల్, కోతుల్ కథ

**నేను అప్పుడెప్పుడో** నలభై ఏళ్ల క్రితం అమెరికా వచ్చినప్పటికీ, ఇప్పటికీ ఒకే ఒక్క విషయంలో అస్సలు తేడా లేదు. అప్పుడు ఎలా ఉందో, ఇప్పుడూ అంతే. అప్పుడు నా జన్మలో మొదటి సారిగా రంగు బొమ్మల టీవీలో హాలీవుడు తారలే కాక పక్కింటి అమెరికా అమ్మాయిలు కూడా ఎర్రగా బుర్రగా ఉండడం, జానీ కార్సన్, బాబ్ హోప్ లాంటి నూటికి నూరు పాళ్ళు అమెరికన్ ఆడు మగాడ్రా" బాపతు తెల్ల వాళ్ళు ఇంగ్లీషులో జోకులు చెప్తూ ఉంటే వాటిల్లో సగం సగం మాత్రమే అర్థం అయినా అబ్బురపడిపోవడం, ఆల్ ఇన్ ది ఫేమిలీ లాంటి తెల్ల వాళ్ళవీ, సాన్ ఫర్డ్ అండ్ సన్ లాంటి నల్ల వాళ్ళ సిట్యుయేషన్ కామెడీ షోలు చూసి అవి కూడా సగం సగం మాత్రమే అర్థం అయినా పడీ పడీ నవ్వెయ్యడం.....ఇవన్నీ ఒక ఎత్తు అయితే వీటన్నింటికీ మధ్యలో పిల్లులకీ, కుక్కలకీ ప్రత్యేకంగా తయారు చేసిన పౌష్టికాహారాల ప్రకటనలు చూసి మొదట్లో అర్థం అయేది కాదు. మా కాకినాడలో మనం మధ్యాహ్నం, రాత్రీ, తినగా మిగిలి పోయిన అన్నం మెతుకులు మా ఇంట్లో తిరిగే కుక్కకి పడేస్తే అది హాయిగా తినేసి మళ్ళీ అదే సమయానికి రెండు పూటలా వచ్చి తోక ఆడించుకుంటూ వచ్చేది కదా...ఇక్కడ రంగు బొమ్మల టీవీలో పిల్లుల్, కుక్కల్ కి ఈ పులిహోర వంటకాలు ఏమిటీ, పిండి వంటలు ఏమిటీ అని నాకు బొత్తిగా అర్థం కాని విషయం. ఆ మాట కొస్తే ఆ ప్రకటనలలో చూపించినట్టు పిల్లి పిల్లలనీ, కుక్క పిల్లలనీ ఇంట్లో సోఫాల మీద కూచోబెట్టుకుని, కావలించుకుని ముద్దెట్టుకోవడం మా అమ్మ చూస్తే ఇంకేమన్నా ఉందా, మన బతుకు కుక్క బతుకే!

ఆ రోజుల్లోనే నాకు వచ్చిన రెండు మహత్తరమైన అనుమానాలు రెండు. ఒకటేమో అమెరికాలో రోడ్డు మీదకి అందరూ కుక్క పిల్లలని షికారుకి తీసుకెళతారు కానీ పిల్లి పిల్లల ని మెడలో తాడు కట్టి వాకింగ్ కి ఎందుకు తీసుకెళ్ళరూ? వాటికి లఘు శంక రాదా? ఇక రెండో ప్రశ్న "అమెరికాలో కోతులు ఎందుకు లేవు?" ఈ రెండు ప్రశ్నలకీ ఈ మధ్యనే నాకు సమాధానాలు దొరికాయి. జై, గూగులమ్మా, జై, జై గూగులమ్మా! ఈ మధ్య కాలంలో ఇండియా నుంచి అమెరికాకి కోతుల దిగుమతి అరికట్టడానికి మా ట్రంప్ గారు విశ్వ ప్రయత్నం చేస్తున్నడనుకోండి. అది వేరే సంగతి.

నలభై ఏళ్ల నాటి అనాగరిక అమాయకత్వపు అజ్ఞానపు బతుకునుంచి అమెరికా వాడిగా పరిణామం చెంది ఇప్పుడు నేను మధ్యాహ్నం, రాత్రి తినగా మిగిలిపోయిన అన్నం మా అమ్మాయి పెంచుకుంటున్న శునకరాజం ..పేరు యోడా...కి దానికి పెట్టడం మానేసి, నేనే తింటున్నాను. కానీ ఆ యోడాకి మటుకు మార్కెట్ లోకి వచ్చిన సరి కొత్త పౌష్టికాహారాలు, ద్రావకాలు, బిస్కట్లు...ఒకటేమిటి నా నెలవారీ భోజనం ఖర్చులో సగం పైగా సదరు యోడా వారి కే కేటాయించి కాలం వెళ్ళబుచ్చుతున్నాను. అంతే కాదు, నా విషయానికి వస్తే ఎప్పుడైనా ఒంట్లో బాగా లేక పోతే డాక్టర్ దగ్గరకి వెళ్తాను కానీ, మా యోడాని మటుకు నెల తప్పకుండా ..అంటే అది కాదు...అలా నెల తప్పకుండా కత్తిరింపు ఏర్పాట్లు ఎప్పుడో జరిగిపోయాయి....ప్రతీ నెలా ఆరోగ్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్ళి ఆ బిల్లు చెల్లించ లేక గూబ వాయించుకుని వస్తూ ఉంటాను. దానికి ప్రధాన కారణం ఈ యోడా నాకు పుత్ర సమానుడు అని నేను ఎంత వాపోయినా ఆ ఆసుపత్రి వాళ్ళు

యోడా బిల్లుల చెల్లింపులకి నాకున్న ఫేమిలీ మెడికల్ ఇన్స్యూరెన్స్ ని వాడుకోనివ్వక పోవడమే కాక ప్రతీ నెలా నన్ను చూడగానే చూసి వెనక్కి తిరిగి నవ్వుకుంటున్నారు. అలా అని పెంపుడు జంతువులకి వేరే ఇన్స్యూరెన్స్ ఉందా అంటే అదీ లేదు. అంతా మన జేబులో చిల్లే.

ఇక....అలా అంటే వారి గొప్ప మనసులు గాయ పడతాయి కానీ ఇక్కడ అమెరికాలో ఈ పెంపుడు జంతువుల ఆసుపత్రులకీ, పవిత్ర భారత దేశంలో కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులకీ చాలా పోలికలే ఉన్నాయి. మొదటిది రెండు చోట్లా డాక్టర్లు తెల్ల కోట్లు, స్టెతస్కోప్ లు వేసుకునే ఉంటారు. మనం ఆయా ఆసుపత్రుల లోపల అడుగు పెట్టగానే గుప్పుమని వేసే సుగంధం కూడా ఒక లాంటిదే. ...నిజానికి అది సుగంధం కాదు లెండి. పాకిస్తాన్ వాడి వంటింట్లోకి వెళ్ళగానే వేసే మసాలా వాసన లాంటిదే. మీకు నమ్మకం కలగడానికి నేను మొదటిసారి మా యోడాని ఆసుపత్రికి తీసుకెళ్ళినప్పటి ఫోటో ఒకటి ఇక్కడ జతపరిచాను. చెప్పొద్దూ, నేను అప్పుడెప్పుడో హైదరాబాద్ వెళ్ళినప్పుడు చూడడానికి వెళ్ళిన ఒక కార్పొరేట్ ఆసుపత్రి లాగానే ఉంది. తేడా అల్లా అక్కడ లాబీలో పేషెంట్స్ తాలుకు బంధువుల అరుపులూ, ఘాట్టిగా మాట్లాడుకోవడాలూ విన్నాను. ఇక్కడ లాబీలో నిశ్శబ్దంగా పని చేసుకుంటున్న ఇద్దరు, ముగ్గురు ఆడంగులూ, ఎక్కడో లోపలి నుంచి పిల్లుల్, కుక్కల్ మావ్, మావ్ లూ, భౌయ్, భౌయ్ లూ మాత్రమే వినపడ్డాయి. ఇక అమెరికాలో మనుషుల కోసం చాలా ఆసుపత్రులే ఉన్నా, జంతువుల కోసం ప్రతీ పేట లోనూ...అవును ప్రతీ చిన్నా, పెద్దా నగరాలలోనూ ప్రతీ పేటకి కనీసం ఒకటైనా ఉంటుంది.





అసలు ఇదంతా ఇప్పుడు ఎందుకు జ్ఞాపకం వచ్చిందీ అంటే...ప్రతీ ఏడూ మార్చ్, ఏప్రిల్ అంటే వసంత ఋతువులో మా టెక్సస్ లో బ్లూ బానెట్ అనే మా రాష్ట్ర పుష్పం విరబూస్తుంది. అది గడ్డి పువ్వు. అంచేత రాష్ట్రం అంతా రోడ్లకి అటూ, ఇటూనూ, ఎకరాల కొద్దీ విస్తీర్ణాలలోనూ ఆ బ్లూ బానెట్ పువ్వులు కొన్ని చోట్లా, దానికి తోడుగా నారింజ రంగు గడ్డి పువ్వులూ, పసుపు పువ్వులతో కనుల పండుగ గా ఉంటుంది. చాలా మంది ప్రతీ వారంతంలోనూ కుటుంబంతో సహా పల్లెటూళ్లలో ఉన్న వేల ఎకరాల టెక్సస్ "రాంచ్"ల కి వెళ్ళి ఫోటోలు తీసుకుంటారు. మొన్ననే ఏడాది దాటిన మా మనవరాలికి ఇదే మొదటి వసంత ఋతువు కాబట్టి ఆనవాయితీ ప్రకారం మా అమ్మాయిలు ఇద్దరూ డాలస్ దగ్గర ఉన్న అలాంటి పువ్వుల పొలాలకి వెళ్ళారు. తగుదునమ్మా అని యోడా కూడా వెళ్ళింది. కాస్సేపు ఆ నలుగురూ ఆటా, పాటలూ, ఫోటోలతో బాగానే అమెరికులాసా చేశారు కానీ అప్పుడే కొంప మునిగింది.



ఏమయిందో తెలియదు కానీ యోడా హఠాత్తుగా మొహం వేళ్ళాడేసి, కళ్ళు తిరిగి పడిపోయింది. పాపం మా అమ్మాయిలు కంగారు పడి దగ్గరలో ఉన్న పెంపుడు జంతువుల ఆసుపత్రి కి హడావుడిగా తీసుకెళ్ల గానే, పల్లెటూరు కదా..అంచేత వాళ్ళు ఏవో ఆయుర్వేదం మందులు లాంటివి వేసి "అర్జంటుగా ఎమర్జెన్సీ ఆసుపత్రికి" తీసుకెళ్ళమని చెప్పారు. అంటే మనకి సరదాగా గుండె పోటు వచ్చింది అనుకోండి. పక్కింట్లో ఉన్న డాక్టర్ దగ్గరకి

తీసుకెళ్తారు కదా! ఆయన తన చేతనైనదేదో చేసి హైదరాబాద్ లో పెద్దాసుపత్రికి, అంటే ఈ రోజుల్లో కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్ళమని చెప్తాడు కదా! అలాగే అనమాట. చెప్పొద్దూ, కుక్క పిల్లలకి కూడా ఎమర్జెన్సీ ఆసుపత్రులు ఉంటాయి అని యోడాకి యజమాని అయిన మా అమ్మాయికి కూడా తెలియదు. అమెరికాలో కాదేదీ ఎమర్జెన్సీకి అనర్హం అని ఇప్పుడు నాకు అర్ధం అయింది..

ఏమైతేనేం, మొత్తానికి యోడాని యమా స్పీడు లో రోజుకి 24 గంటలూ పని చేసే ఆ ఆత్యయిక ఆసుపత్రికి తీసుకెళ్లగానే అక్కడి డాక్టర్ దాన్ని ఐసీయు లో పెట్టి, ఆక్సిజన్, ఐవీ తదితర అత్యవసరమైన చికిత్సలు చేశాడు. అలా ఒక రోజు ఐసీయు లో పూర్తి చికిత్స అందగానే మా యోడా కోమా నుంచి కోలుకుని మామూలు కుక్క పిల్ల అయి తోక జాడించడం మొదలు పెట్టింది. మా అమ్మాయి అది వాట్సాప్ వీడియో లో చూపించినప్పుడు ఒక చిన్న బొచ్చు కుక్క పిల్ల తోక జోరుగా ఊపినప్పుడు నాకు అంత సంతోషం కలుగుతుంది అని ఈ జన్మ లో ఎప్పుడూ అనుకోలేదు. మొత్తానికి మా యోడా పెద్ద గండం నుంచి బయట పడింది, ఇంతకీ ఆ ప్రాణ గండానికి కారణం బహుశా ఆ బ్లూ బానెట్స్ అంటే ఎలర్జీయో, లేక ఏదైనా ఆ గడ్డిలో ఉన్న విష పురుగు కుట్టడమో అయి ఉంటుంది అని ఆ డాక్టర్ అభిప్రాయం.



మా అమ్మాయి ధర్మమా అని ఇప్పుడే ఆయన అభిప్రాయమూ మరియు ఆయన చేసిన ఎమర్జెన్సీ చికిత్స వలన నా క్రెడిట్ కార్డు బిల్లులో జరిగిన వేల కొద్దీ డాలర్ల డేమేజీ ఎంతో ఇప్పుడే చూశాను. చూడగానే నా గుండెలో ఎక్కడో కలుక్కుమంది. నా మొహం లో హఠాత్తుగా కళ తగ్గిపోవడం, కళ్ళు తేలిపోవడం చూడగానే మా క్వీన్ విక్టోరియా 911 ని పిలిచేసి "అర్జంట్...వెంటనే ఏంబ్యులెన్స్ పంపించండి. అదే మా యోడాకి ..అంటే మా కుక్కి హార్ట్ ఎటాక్ వచ్చింది, దాని బిల్లు చూడగానే ...అదే మా బొచ్చు కుక్కకి గుండె...మా అడ్రెస్ కావాలా? "అని ఆ 911 అమ్మాయికి విషయం చెప్తూనే ఉండగానే .....పోలోమని సైరన్ మోగుతూ, ఎరుపూ, నీలం రంగులతో మా ఇంటి ముందు ఏంబ్యులెన్స్ ఆగింది. ఈ లోగా నేను కోలుకుని ఎవరా అని నేను తలుపు తీయగానే హడావుడిగా తెల్ల కోట్లు వేసుకున్న ఒక కుర్రాడు, ఒక కుర్రది "ఎక్కడ, మీ యోడా ఎక్కడ?" అని చుట్టూ చూడడం మొదలు పెట్టారు. మరి యోడా డాలస్ లో ఉంది కదా. అంచేత నాకు నాకు ఏమీ అర్ధం కాక వెర్రి మొహం పెట్టగానే "ఇప్పుడే ఈ ఇంట్లో ఓ బొచ్చు కుక్క కి గుండెల్లో కులుక్కుమంది అని ఫోన్ వచ్చింది. మేం పెంపుడు జంతువుల ఏంబ్యులెన్స్ టెక్నీషియన్లం. ముందు తోక ఆడిస్తోందో లేదో చూడాలి. వేర్ ఇస్ దట్ డాగ్?" అన్నాడు కుర్రాడు. మా క్వీన్ విక్టోరియా నాకేసి వేలు చూపెట్టబోయి గబుక్కున చేతులు కిందకి దింపేసుకుంది.

**COMMENTS**